# సనాతన సంస్కృతిలో మహిళలకు అత్యున్నత ప్రాధాన్యం

- హైదరాబాద్‌లో వైభవంగా 'స్త్రీ శక్తి - సనాతన శక్తి'
- సందడిగా ఆధ్యాత్మిక చైతన్య సదస్సు
- మహిళలతో కిక్కిరిసిన సభా ప్రాంగణం



భారతీయ సనాతన ధర్మంలో మహిళలకు ప్రాచీన కాలం నుంచే అత్యంత పవిత్రమైన, అద్భుతమైన మరియు పూజనీయమైన స్థానం కల్పించబడిందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. సమాజ వికాసంలోనూ, మానవ మనుగడలోనూ స్త్రీ పాత్ర అమూల్య మైనదని ఆయన కొనియాడారు. మన చరిత్ర, వేద సంస్కృతి మరియు ఆధ్యాత్మిక మూలాలలో ఇందుకు ఎన్నో ప్రత్యక్ష నిదర్శనాలు, ఆదర్శప్రాయమైన ఉదాహరణలు స్పష్టంగా కనిపిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళల శ్రేయస్సుకు, రక్షణకు మరియు వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ గౌరవించాలని పిలుపునిచ్చారు.

విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని చందానగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 'స్త్రీ శక్తి - సనాతన శక్తి' అనే ప్రత్యేక చైతన్య కార్యక్రమాన్ని అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. మహిళల్లో అంతర్లీనంగా దాగి ఉన్న




మహా శక్తిని, మేధస్సును మరియు సామర్థ్యాన్ని సరైన మార్గంలో వెలికి తీస్తే సమాజంలో అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయనే ప్రధాన సంకల్పంతో ఈ కార్యక్రామాన్ని రూపొందించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విచ్చేశారు.

కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీ రాజశ్యామలాదేవి దర్బారు సేవలో గవర్నర్ విశేషంగా పాల్గొన్నారు. శ్రీ రాజశ్యామలాదేవి దివ్య మూర్తికి అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం విశాఖ శ్రీ శారదా పీఠం ప్రతినిధులు గవర్నర్‌ను శాలువాతో సత్కరించి, పీఠం తరపున శేషవస్త్రాలు, మంత్ర అక్షతలు మరియు దివ్య ప్రసాదాలను అందజేశారు.

ఈ సదస్సులో మహిళల పాత్ర, సామాజిక వికాసం మరియు సనాతన ధర్మంలో వారి మహోన్నత స్థానం అనే అంశాలపై పలువురు మహిళా ప్రముఖులు లోతైన ప్రసంగాలు చేశారు. ప్రొఫెసర్ విజయలక్ష్మి, రమా విశ్వనాథన్, వాణి సక్కుబాయి, వారణాసి రాధిక, పల్లా రాధిక మరియు మౌనిక సుంకర తదితర వక్తలు వేదికనలంకరించి సమగ్రంగా మాట్లాడారు. ప్రాచీన వేద కాలం నాటి గార్గి, మైత్రేయిల నుంచి నేటి ఆధునిక యుగంలో వివిధ రంగాలు ఏలుతున్న మహిళల వరకు స్త్రీలు సాధించిన విజయాలను గుర్తుచేశారు. సనాతన సంస్కృతి మహిళకు ఇచ్చిన స్వేచ్ఛ, గౌరవం మరియు భాగస్వామ్యాన్ని వివరణాత్మకంగా తెలియజేస్తూ సభను విశేషంగా చైతన్యపరిచారు.

విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి తమ అమృత మయమైన అనుగ్రహ భాషణం చేస్తూ సభను ఉత్తేజపరిచారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ నాగరికతలను పరిశీలిస్తే, మహిళలకు అత్యున్నత గౌరవాన్ని మరియు పవిత్రమైన స్థానాన్ని అందించిన దేశాల్లో భారతదేశం ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. మన దేశంలో ప్రవహించే జీవనదులకు, పవిత్రమైన పర్వతాలకు సైతం మహిళల పేర్లు పెట్టి, వాటిని దైవస్వరూపాలుగా ఆరాధించుకునే దివ్యమైన ఆచారం ఒక్క సనాతన సంస్కృతిలోనే ఉందన్నారు.

మన దేశం తల్లి రూపాన్ని ప్రతిబింబిస్తుందని, అందుకే 'భారతమాత' అని ఎంతో భక్తిశ్రద్ధలతో మహిళా మూర్తిగా కొలుచుకుంటున్నామని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి గుర్తుచేశారు. స్త్రీ రూపాన్ని ఆద్యశక్తిగా, లక్ష్మి, సరస్వతి, పార్వతి స్వరూపాలుగా ఆరాధించడం మన ప్రాచీన సంప్రదాయమని విశదీకరించారు. మన సమాజం మరియు సంస్కృతి స్త్రీ మూలాలపైనే నిర్మితమయ్యాయని, అటువంటి విశిష్ట సాంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.



అనంతరం పీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ప్రసంగిస్తూ.. స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి, వారి సాధికారతకు భారతీయ సనాతన సంప్రదాయం ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. విశాఖ శారదా పీఠం కేవలం ఆధ్యాత్మిక కార్యకలాపాలకే పరిమితం కాకుండా, సమాజంలో మహిళలను విద్యా, సామాజిక, ఉపాధి రంగాలలో ప్రోత్సహించేందుకు నిరంతరం అనేక చొరవలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చినప్పుడే దేశం మరింత శోభిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ మహా సదస్సు విజయవంతం కావడానికి చందానగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి,

ప్రధాన అర్చకులు సాయి ఆచార్యులు గారి నేతృత్వంలో అర్చక బృందం, స్థానిక శ్రేయోభిలాషులు



మరియు స్వచ్ఛంద కార్యకర్తలు ఎంతో శ్రమించారు. ఆహుతులకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యక్రమ నిర్వహణను అత్యంత శ్రద్ధతో సమన్వయం చేశారు. సభకు విచ్చేసిన భక్తులకు, మహిళలకు ప్రత్యేక దర్శనాలు మరియు ఆత్మీయ మర్యాదలు కల్పించారు.

ఆధ్యాత్మిక ధార్మిక ప్రసంగాలతో పాటు ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను, భక్తులను ఎంతగానో అలరించాయి. నాట్య వేద కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, సంప్రదాయ నృత్యాలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి అభినయం, హావభావాలు వీక్షకులను సమ్మోహితులను చేశాయి.

చివరగా వారణాసి శ్రీకృష్ణ రాఘవ బృందం సమర్పించిన సంగీత ప్రదర్శన, ఆధ్యాత్మిక సంకీర్తనలు ప్రాంగణమంతటా భక్తిరసాన్ని కురిపించాయి. ఈ దివ్యమైన సంగీత విభావరి ఆలయ వాతావరణాన్ని మరింత పవిత్రంగా మార్చి, హాజరైన భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. పలువురు ప్రముఖుల పాల్గొనడంతో ఈ సదస్సు అత్యంత శోభాయమానంగా, చిరస్మరణీయంగా ముగిసింది.

